

మరో ముగ్గురు తహశీల్దార్లకు పోస్టింగ్‌లు

రాజమహేంద్రవరం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో ముగ్గురు తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు దేవరపల్లి తహశీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి, రాజానగరం తహశీల్దార్‌గా ఎన్.లక్ష్మీలావణ్య,రాజమహేంద్రవరం కెఆర్ఆర్ స్పెషల్ తహశీల్దార్‌గా డి.సుగుణలను నియమించారు. ఇటీవల 17 మందికి పోస్టింగ్‌లు ఇచ్చిన సంగతి తెలిసిందే.ఈ ముగ్గురిని కలిపితే 20 మంది తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

జైలు పక్షుల.. కలత తీరేనా!



- స్వాతంత్ర్య దినోత్సవంపై ఆశలు
- 2019లో చంద్రబాబు హామీ
- ఈ సారి నెరవేరుస్తారని ఆశ
- సెంట్రల్ జైలు ఖైదీలు 1250
- 66 మందికి అవకాశం
- జైలు అధికారుల నివేదిక
- కూటమి నిర్ణయమే తరువాయి
- నాడు క్షమాభిక్ష పెట్టని జగన్
- ఐదేళ్లూ ఖైదీలకు అన్యాయం



'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏమాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే'
- దేశ సర్వోన్నత న్యాయస్థానం.

క్షమాభిక్షకు ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. రాజకీయ కక్ష సాధింపుతోనే జగన్ ఐదేళ్ల పాలన సరిపెట్టారు. వైసీపీ పాలకులు కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకుంటూ..ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబం తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోయేవారు. ఖైదీల పిల్లల ఆవేదన అయితే మాటల్లో వర్ణించలేం. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం రావడంతో మళ్లీ తమకు ఏ ఇబ్బందులూ లేకుండా క్షమాభిక్ష జీవోలు క్రమం తప్పకుండా వస్తాయని ఖైదీల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదలకు ఆశగా ఎదురు చూస్తున్నారు.

2019లో చంద్రబాబు హామీ ఇచ్చినా..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఇబ్బంది లేకుండా క్షమాభిక్ష జీవోలు సమయానుకూలంగా జారీ అయ్యేవి. వీటికి రాజకీయ లబ్ధితో లింకు ఉండేది కాదు. అప్పట్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. 'మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోలకు ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో చంద్రబాబుకు క్షమాభిక్ష పెట్టే అవకాశం లేకుండా పోయింది. అయినా చంద్రబాబు గతేడాది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు తమ గోడు వినిపించుకోడానికి ఖైదీలు ప్రయత్నించినా కుదరలేదు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. దీనికీ మెలిక పెట్టడంతో చాలా మంది ఖైదీలకు అన్యాయం జరిగింది. జైలు అధికారులు ఎంతో ప్రయాసపడి వేగంగా ప్రక్రియ పూర్తి చేసి జాబితా పంపించినా హైపవర్ కమిటీ, ప్రభుత్వం వద్ద నెలల తరబడి తాత్సారం చేయడం జరిగేది. సుప్రీం కోర్టు నిర్దేశాలపై సైతం పట్టింపు లేకుండా వ్యవహరించారు.ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతేడాది రెండు ఫేజుల్లో విడుదల కావాల్సిన జాబితా పెండింగ్‌లోనే ఉంది.మొదటి ఫేజ్‌లో 141, రెండో ఫేజ్‌లో 29 మందితో కూడిన జాబితాను జైళ్ల అధికారులు ఉన్నతాధికారులకు పంపించి నెలలు గడుస్తున్నా ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఈలోపు కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో చంద్రబాబు ఆనాటి హామీని ఖైదీలు గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో ఉన్న ఖైదీలు ఆగస్టు 15వ తేదీకి విడుదలయ్యేలా జీవో వస్తుందని ఎదురుచూస్తున్నారు.

సెంట్రల్ జైలులో 66 మంది..

ఈ స్వాతంత్ర్య దినోత్సవానికి విడుదల చేయడానికి వీలుగా కూటమి ప్రభుత్వం జీవో ఇస్తే రాష్ట్రంలోని రాజ మహేంద్రవరం,విశాఖపట్నం, కడప, నెల్లూరు సెంట్రల్ జైళ్లతో పాటు వివిధ కారాగారాల్లో శిక్ష అనుభవిస్తున్న మొత్తం 170 మంది ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ కుటుంబాల చెంతకు చేరుతారు.వీరిలో మహిళా ఖైదీలు ఉన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ప్రస్తుతం 1250 మంది ఖైదీలు ఉన్నారు. వీరిలో 450 మంది జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. క్షమాభిక్షకు 44 మంది ఎదురు చూస్తున్నారు. మహిళా ప్రత్యేక జైలులో 80 మంది ఖైదీలు ఉండగా 22 మంది క్షమాభిక్ష జాబి తాలో ఉన్నారు. ప్రభుత్వం జీవో ఇస్తే స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు జైళ్లలో కలిపి 66 మంది స్వేచ్ఛా వాయువులు పీల్చుకోనున్నారు. సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత మహిళా ప్రత్యేక జైలును సందర్శించనున్నారు. సుప్రీంకోర్టు నిర్దేశాల ప్రకారం ప్రత్యేక రోజులతో సంబంధం లేకుండా క్షమా భిక్షపై విడుదల చేయవచ్చు.కానీ గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలు,గాంధీ జయంతికి విడుదల చేయడం సంప్రదాయంగా వస్తోంది.

క్షమాభిక్షలోనూ జగన్ మెలిక

టీడీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. కనీసం రెండేళ్లకు ఒకసారైనా పెద్ద సంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. తమ కుటుంబాల చెంతకు చేరి కొత్త జీవితం ప్రారంభించేవాళ్లు. కానీ జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో మగ్గిపోయారు. ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీల విడుదల జరిగింది. అప్పుడు రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలు,మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మందికిపైగా ఖైదీలు బయటకు వెళ్లారు. దానిలోనూ ఖైదీలకు అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే..2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు. దీంతో ఆ ఖైదీలు వైసీపీ ప్రభుత్వం వల్ల ఏడాది శిక్ష అదనంగా అనుభవించాల్సి వచ్చింది.

కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7 ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హులవుతారు.ఇంకా కొన్ని నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. జైలులో 15 ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్(సత్ప్రవర్తనకు కల్పించే ఉపశమనం)తో కలుపుకొని 20 ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65 ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవోల జారీపై తీవ్ర నిర్లక్ష్యంతో సుప్రీం, సామాజిక నిపుణుల ఉద్దేశం సైతం నీరుగారిపోతోంది. కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఆర్థిక, కుటుంబ పరిస్థితులు, ఖైదీ సత్ప్రవర్తన ప్రధా నంగా దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతున్నారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం ఆదేశాలతో సమయానుగుణంగా నిబంధనలను అనుసరించి విడుదల చేయాల్సి ఉంటుంది. ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష ప్రసాదించాలి. మొదటి ఫేజుకు జూన్ 1,రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా జీవోలో పేర్కొన్నారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తిచేయాలి.ఫేజ్1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా,ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీ లను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవా లి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది. అంటే ఫేజ్ 1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి 1, ఫేజ్3కి జూన్ 1లోగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలి.

ఆర్డర్ వస్తే.. విడుదల చేస్తాం..




ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే తదుపరి ప్రక్రియ పూర్తి చేసి విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సిబ్బందికి ఇప్పటికే ఈ మేరకు సూచించడం జరిగింది. కొత్త ప్రభుత్వం వచ్చిన విషయం తెలిసిందే. అందువల్ల రెండు ఫేజుల జాబితా మళ్లీ ప్రభుత్వానికి వెళ్లే అవకాశం ఉంది. ఏదేమైనా జీవో త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాం.
- రవికిరణ్,జైళ్ల శాఖ డీఐజీ, కోస్తాంధ్ర ప్రాంతం

అన్నదాతకు తీపి కబురు



నేడు రైతుల ఖాతాలకు ధాన్యం బకాయి సొమ్ము

రూ. 27.71 కోట్లు విడుదల చేసిన కూటమి



కలెక్టర్ విడుదల చేసిన చెక్

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అన్నదాతకు తీపికబురు చెప్పింది.. ప్రభుత్వం మారడంతో ధాన్యం విక్రయించిన సొమ్ములు అసలు వస్తాయో రావో తెలియక రైతులు అయోమయం పడిపోయారు. అయితే కూటమి ప్రభు త్వంపై నమ్మకంతో నేటి వరకూ రైతులు ధాన్యం బకాయిలపై నోరుమెదపలేదు. అయితే సీఎం చంద్రబాబు మాత్రం రైతుల ధాన్యం బకాయిల చెల్లింపునకు ఆదేశాలు విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి ధాన్యాన్ని పండించే రైతులను గత వైసీపీ ప్రభుత్వం అష్టకష్టాల పాల్జేసింది. గతేడాది ఖరీఫ్‌లో ధాన్యం అమ్మకాలకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంత ధాన్యం వర్షానికి దెబ్బ తినగా, మంచి ధాన్యాన్ని కొనకుండా తాత్సారం చేశారు. అప్పట్లో ఇప్పటి సీఎం, అప్పటి ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు స్వయంగా పొలాల్లో తిరిగి రైతులకు భరోసా కల్పించారు. ధాన్యాన్ని వెంటనే కొనకపోతే తాడేపల్లి ప్యాలెస్‌ను రైతులతో కలిసి వచ్చి ముట్టడిస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. తర్వాత ప్రస్తుత ఉపముఖ్యమంత్రి, జనసేన నేత పవన్ కల్యాణ్ కూడా రైతుల వద్దకు నేరుగా వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంత వరకూ ధాన్యం కొనుగోలు చేశారు. రబీ సీజన్‌లో ఎన్నికల సమయంలో కూడా రైతులను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. జిల్లాలో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం పండితే గత ప్రభుత్వం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా కేవలం 2,28,423 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. దానికి కూడా పూర్తిగా డబ్బు ఇవ్వలేదు. ఎన్నికల ముందు కొంత మాత్రం ఇచ్చింది. జిల్లాలో మొత్తం 22,605 మంది రైతులు ధాన్యం విక్రయించగా వీరికి రూ.498.65 కోట్లు చెల్లించాల్సి ఉంది. వారిలో కొంతమందికి మాత్రమే చాలా ఆలస్యంగా వారి ఖాతాల్లో కొంత సొమ్ము జమ అయింది. ఎన్నికల పోలింగ్.. కౌంటింగ్‌కు మధ్య అధికారులు కొంత జమ చేయించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.200 కోట్ల బకాయి ఉండిపోయింది. దీంతో రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు.ఈ మేరకు 1147 మంది రైతులకు సంబంధించిన రూ 27.71 కోట్లు బకాయి ఉండిపోయింది. ఈ సొమ్మును సోమవారం రైతుల ఖాతాలో జమచేయనున్నారు.జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం రైతులకు జమ చేయడానికి ముందుగానే చెక్ సిద్ధం చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం రైతుల సమక్షంలో బకాయిలను జమచేస్తారు.

కేటుగాడు..చిక్కాడు!



మంచితనం ముసుగు వేసుకున్నాడు.. మూడు నెలలుగా నమ్మించాడు.. సమయం చూసి గత నెల 30వ తేదీన ఇద్దరు బాలికలను ఎత్తుకుపోయాడు.. కంగారుపడిన తల్లి పోలీసులను ఆశ్రయించినా వాళ్లేం కంగారుపడలేదు.. భయపడిన తల్లి శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం వెళ్లి టీడీపీ నాయకుడు వర్మను కలిసింది.. అంతే పోలీసుల్లో అప్పుడు కంగారొచ్చింది.. రెండు రోజుల్లోనే బాలికలను ఎత్తుకుపోయిన కేటుగాడిని పట్టేశారు.. సోమవారం కేసు వివరాలను వెల్లడించనున్నారు..

- వివరాలు 5లో

సొసైటీలు నిర్వీర్యం

- ఐదేళ్లూ గాలికొదిలేసిన వైసీపీ
- నామినేటెడ్‌గా పదవులు కేటాయింపు
- త్రీమెన్ కమిటీల పేరుతో నిర్వహణ
- అవకతవకలమయంగా సొసైటీలు
- ఎన్నికలు జరపాలని డిమాండ్
- కూటమిపై రైతుల ఆశలు

కోరుకొండ, ఆగస్టు 11 : నామినేటెడ్ పోస్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సొసైటీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని నాయకులు ఎదురుచూస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అంతా ఇంతా డిమాండ్ కాదు.. ఆ పదవులు కోసం ప్రత్యేకంగా ఎదురుచూసేవారు.. సమర్థులైన వారు ఎన్నికయ్యేవారు.. సొసైటీలను బలోపేతం చేసేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను నిర్వీర్యం చేసి రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చివేసింది. సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి చాలా ఏళ్లయింది. ఆరంభంలో మూడేళ్లకోసారి సహకార సంఘాల ఎన్నికలు జరిగేవి. 2014కు ముందు సహకార సంఘాలకు ఎన్నికలు సజావుగా సాగేవి. రాష్ట్ర విభజన తరువాత సొసైటీ ఎన్నికలను మర్చిపోయారు. 2018లో సహకార సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి టీడీపీ ప్రభుత్వం సహకార సంఘాల పాలక మండలి పదవీ కాలాన్ని ఆరునెలల చొప్పున మూడుసార్లు పొడిగించారు. తదుపరి 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సహకార వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేసింది. గడచిన ఐదేళ్లలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోగా వాటిని రాజకీయ పునరావాస కేంద్రాలుగా తయారు చేసింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతులు భాగస్వాములుగా డైరెక్టర్లను ఎన్నుకుంటారు. డైరెక్టర్లు అంతా కలిసి సంఘానికి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. రైతుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించేవారని సంఘ అధ్యక్షులుగా ఎన్నుకునేవారు. గత వైసీపీ పాలనలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. త్రీమెన్ కమిటీల పేరుతో ఏడాదిన్నరకు సొసైటీకి ముగ్గురిని నామినేట్ చేస్తూ గత ఐదేళ్లలో మూడు సార్లు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. ఇతర మాజీలకు సొసైటీల్లో ముగ్గురు చొప్పున నామినేట్ చేసేవారు. దీంతో సహకార వ్యవస్థ లక్ష్యం దెబ్బతింది. రైతులతో ఏ మాత్రం ప్రమేయం లేకుండా వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యేలకు అనుచరులుగా పని చేసే వారికి సహకార సంఘ అధ్యక్ష పదవులు కట్టబెట్టింది. దీంతో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగాయి. దీనికి శ్రీరంగపట్నం సొసైటీ ఒక ఉదాహరణ. కోరుకొండ మండలంలో గల శ్రీరంగపట్నం, బూరుగుపూడి,దోసకాయలపల్లి, గాడాల, కోరుకొండ సొసైటీలు ఉన్నాయి. గత వైసీపీ పాలనలో ఒక్కో సొసైటీకి ముగ్గురు చొప్పున మూడు దపాలుగా 9 మందికి రాజకీయ పునరావాసం కల్పించింది. మొత్తం 5 సొసైటీల్లో 45 మందికి త్రీమెన్ కమిటీల పేరుతో పదవులు కట్టబెట్టింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పూర్వవైభవం తీసుకురా వాలని.. ఎన్నికలు నిర్వహించాలని రైతాంగం కోరుతున్నారు.




సూచనలు చేస్తున్న ఎస్పీ

సీసీ కెమెరాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పని తీరుపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ రూంలోని సీసీ కెమెరాల ఫుటేజీని ఆదివారం పరిశీలించారు. కంట్రోల్ రూం ఇన్‌చార్జి సీఐ జి.ఉమామహేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉన్న 481 సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని నేర నియంత్రణకు కృషి చేస్తామని ఎస్పీ చెప్పారు. ఈ క్రమంలో నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ ఇల్లు, కార్యాలయాలు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నేడు హోంమంత్రి అనిత రాక

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఉదయం 9 గంటలకు తహశీల్దారు కార్యాలయం వెనుక నూతనంగా నిర్మించిన సెంట్రల్ జైలు పెట్రోలు బంకును ప్రారంభిస్తారు. తర్వాత మహిళా ప్రత్యేక జైలు, కేంద్ర కారాగారాన్ని పరిశీలిస్తారు. కేంద్ర కారాగారంలోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తారు.అనంతరం జైలు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్ ప్రారంభిస్తారని కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ తెలిపారు.హోంమంత్రి పర్యటన ఏర్పాట్లను హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ సోమవారం ఉదయం పరిశీలిస్తారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11 : ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి అధికారులంతా పాల్గొంటారన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ,ఆర్‌డీవో, మండల పరిషత్ కార్యాల యాల్లోనూ ప్రజాసమస్యల పరిష్కారవేదికను అధికారులు నిర్వహిస్తారన్నారు. ఈ మేరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు.

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు



నిడదవోలు, ఆగస్టు 11 : శ్రావణ మా సం తొలి ఆదివారం సందర్భంగా నిడద వోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి విశేష పూజలు చేశారు. అమ్మ వారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహా రతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుం కుమ పూజలు నిర్వహించారు. అనంత రం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించు కుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,25,211లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



47 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గురువులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

ఎన్నేళ్లో వేచిన ఉదయం

కిర్లంపూడి, ఆగస్టు 11: కాకినాడ జిల్లా కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఎవరెవరు ఏమి చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో సంతోషంగా గడిపారు. కుటుంబసమేతంగా హాజరైన వారంతా వారి పిల్లలను ఒకరికొకరు పరిచయం చేసి సందడి చేశారు. రోజంతా తోటి మిత్రులతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి సత్కరించి వెండి ఆభరణాలు, జ్ఞాపికలు అందజేసి గౌరవించారు.



పది అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

ఒకే పోగుతో పది అడుగుల జాతీయ జెండా

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: ఒకే పోగుతో తయారు చేసిన పది అడుగుల జాతీయ జెండాను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ జెండాను పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల సత్యనారాయణ తయారు చేశాడు. ఒకే పోగుతో జాతీయ జెండాను తయారు చేయడం ఉభయ గోదావరి జిల్లాల వాసులకు గర్వకారణమని దుర్గేష్ అన్నారు. రాకా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు పాల్గొన్నారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 11: గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. ఆదివారం రాత్రి ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 7.10 అడుగులుగా నమోదు కాగా 4,08,157 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తున్నది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 2వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.



14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణ

సామర్లకోట, ఆగస్టు 11: ఇటీవల పలు కారణాలతో, విజయవాడ రైల్వే కారిడార్ ఆధునికీకరణ పనులతో అటు విశాఖ వైపు, ఇటు విజయవాడ వైపు రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో 14 రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తూ రైల్వే అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి ఆదేశాలు అందాయి.

- విశాఖపట్టణం-కడప-విశాఖ మధ్య రాకపోకలు సాగించే 17488, 17487 నంబర్లు గల తిరుమల ఎక్స్‌ప్రెస్.
- విశాఖ-గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే 22701, 22702 నంబర్లు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్.
- విజయవాడ-విశాఖపట్టణం-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే 12718, 12717 నంబర్లు గల రత్నాచల్ ఎక్స్‌ప్రెస్.
- మచిలీపట్టణం-విశాఖపట్టణం-మచిలీపట్టణం మధ్య రాకపోకలు సాగించే 17219, 17220 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్.
- గుంటూరు-విశాఖపట్టణం-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17239, 17240 నంబర్లు గల సింహాద్రి ఎక్స్‌ప్రెస్.
- తిరుపతి-విశాఖపట్టణం-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే 22708, 22707 నంబర్లు గల డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.
- రాజమహేంద్రవరం-విశాఖపట్టణం-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే 07466, 07467 నంబర్లు గల మెమూ.
- గుంటూరు-రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17243, 17244 నంబర్లు గల రైళ్లు.
- విశాఖపట్టణం-ఎస్ఎంవీబీ బెంగళూరు-విశాఖపట్టణం మధ్య రాకపోకలు సాగించే 08543, 08544 నంబర్లు గల సూపర్‌ఫాస్ట్.

వీటన్నిటినీ ఈ నెల 18వ తేదీ నుంచి పునరుద్ధరిస్తారు. ఆయా ప్రదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు సదరు రైళ్లల్లో రిజర్వేషన్ టిక్కెట్లు పొందేందుకు బుకింగ్ కౌంటర్ల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి కోరారు.





జేసీ మాల్ ఫ్యాషన్ షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి శ్రీలీల, పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరంలో జేసీ మాల్ షోరూం

ప్రారంభించిన సినీ నటి శ్రీలీల, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: నగరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో ఏర్పాటుచేసిన జేసీ మాల్ ఫ్యాషన్ షోరూమ్‌ను వర్ధమాన సినీ తార శ్రీలీల, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. వస్త్ర ప్రపంచంలో తలమానికంగా అలరారుతున్న ఇంత పెద్ద షాపింగ్ మాల్‌ను రాజమహేంద్రవరంలో ప్రారంభించిన జేసీ యాజమాన్యాన్ని మంత్రి దుర్గేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్‌పర్సన్ జమునారెడ్డి మాట్లాడుతూ తాము ఇప్పటికే తెలంగాణలో పలు ఫ్యాషన్ మాల్స్ ప్రారంభించామని, అవన్నీ కస్టమర్ల అభిమానాన్ని, ఆదరణను చూరగొన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా రాజమహేంద్రవరంలో ప్రారంభించామని చెప్పారు.

సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ జేసీ మాల్ ఫ్యాషన్ షోరూంలను తెలంగాణాలో చూశామన్నారు. ముచ్చటైన కలర్స్ మహిళలు మెచ్చే డిజైన్లతో అందరికీ అందుబాటులో ఉండే ధరలతో మంచి స్పందన వచ్చిందని, రాజమహేంద్రవరంలో షోరూమ్‌ను కూడా ఆదరించాలని కోరారు.

నెల్లూరులో కేటుగాడు!

- సాంకేతిక సహాయంతో గుర్తించిన పోలీసులు
- బాలికలిద్దరూ సురక్షితం
- నేడు రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం



రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన ఇద్దరు బాలికలను ఓ యువకుడు ట్రాప్ చేసి తీసుకెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఆ కేటుగాడిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారని, బాలికలు సురక్షితంగా ఉన్నారని తెలుస్తోంది. విజయ నగరం జిల్లా బత్తిరాజేరు మండలం పెదమన్నాపురానికి చెందిన మారోజు వెంకటేశ్ అదే ఊరికి చెందిన ఓ 17ఏళ్ల బాలికతో గత ఏడాది జూలైలో ఉడాయించాడు. దీనిపై అక్కడి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలికను వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ ధవళేశ్వరం చేరుకున్నాడు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కల్లబొల్లి మాటలు చెప్పి డబ్బులు లాగేసి ఆ ఊరి నుంచి మరో ఊరికి వెళ్లిపోవడం ఇతడికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో ధవళేశ్వరంలో తాను ఉంటున్న ఇంటి పక్కన ఉన్న ఒక మహిళతో పరిచయం పెంచు కున్నాడు. బుద్ధిమంతుడిగా నటిస్తూ దగ్గరయ్యాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొద్ది నెలల తర్వాత రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను తీసుకొని విజయవాడ వెళ్లి ఓ చోట బస కల్పించాడు. ధవళేశ్వరం వచ్చి పిల్లాడిని తీసుకెళ్లి తల్లి వద్దకు చేర్చాడు. హాస్టల్‌లో దింపుతానని ఆ ఇద్దరు బాలికలకూ మాయమాటలు చెప్పి అతడి వెంట తీసుకెళ్లాడు. వాళ్లు హాస్టల్‌కి చేరకపోవడంతో తల్లి చేసిన ఫిర్యాదుతో గత నెల 30న ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో తల్లి రెండు రోజుల క్రితం కాకినాడ జిల్లా పిఠాపురం వెళ్లి టీడీపీ ఇన్‌చార్జి వర్మకు విన్నవించింది. ఆయన ఎస్పీతో మాట్లాడడంతో దర్యాప్తులో వేగం పెరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ కార్యాలయంలోని సైబర్ సెల్ నిరంతర పర్యవేక్షణ చేసింది. దీంతో రెండు రోజుల్లోనే కేసు ఓ కొలిక్కి వచ్చింది. సాంకేతికత సహాయంతో బాలికలతో ఆ నిందితుడు నెల్లూరులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై వాళ్లు అక్కడి నుంచి మరోచోటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్న అనంతరం వెంకటేశ్‌తో పాటు ఆ బాలికలను చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురినీ సోమవారం రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. బాలికలను తీసుకెళ్లడంలో నిందితుడి ఉద్దేశ్యం వెల్లడి కావాల్సి ఉంది. కాగా మిస్సింగ్ కేసుల్లో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనడానికి ఈ కేసు తాజా ఉదాహరణనే ఆరోపణలు వినవస్తున్నాయి. పది రోజుల్లో సాధ్యం కాని పని ప్రజాప్రతినిధుల హెచ్చరికలతో కేవలం రెండు రోజుల్లో ఎలా సాధ్యమైందని కొందరు ప్రశ్నిస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

గంజాయితో నక్కి... పోలీసులకు చిక్కి

- ఆరుగురి అరెస్టు
- 7.6 కిలోల గంజాయి స్వాధీనం
- రెండు మోటారు సైకిళ్లు సీజ్

కాకినాడ రూరల్, ఆగస్టు 11: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ ఎన్‌డీ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ వి.మణికుమార్ సిబ్బందితో కలిసి కాకినాడ రూరల్ మండలం చీడిగ ఫ్లై ఓవర్ సమీపంలో గల ఖాళీ స్థలంలో గంజాయి రవాణా, అమ్మకం జరుగుతోందన్న సమాచారంతో శనివారం మధ్యాహ్నం దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు వెల్లడించారు. కాకినాడ డివిజన్‌లో గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఏర్పాటుచేసిన ఒక బృందం గంజాయి రవాణా, అమ్మకాలపై పూర్తి నిఘా పెట్టిందన్నారు. ఇంద్రపాలెం పీఎస్‌లో కేసు నమోదు చేసి ఆ ఆరుగురిని రిమాండుకు పంపిస్తున్నామన్నారు. పాలెపు సతీష్‌పై కాకినాడ 1, 2 పోలీస్ స్టేషన్లలో ఆరు దొంగతనం కేసులు, రెండు గంజాయి కేసులు, కర్రి శామ్యూల్, మరువాడ శ్రీనివాస్, బోయి వెంకటరమణలపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మర్డర్ కేసు వున్నాయి. మరో ఇద్దరు కలపరెడ్డి శివకుమార్, వీరిని ప్రభుతేజ అని డీఎస్పీ వివరించారు.



తలుపులమ్మ అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

'లోవ'లో శ్రావణ శోభ

తుని రూరల్, ఆగస్టు 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం శ్రావణ శోభ సంతరించుకుంది. పెద్ద ఎత్తున మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 15వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. దర్శనాంతరం ఆలయ ప్రాంగణంలో వంటా-వార్పుచేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం రూ.4.67 లక్షల ఆదాయం వచ్చింది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో కిశోర్‌కుమార్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 11: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.2,73,809 లభించింది. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి యానానికి చెందిన గుబ్బల పరంజ్యోతి-హిమపావని దంపతులు రూ.1.16 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, ఆగస్టు 11: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని మలికిపురం భూపతివారిపేటకు చెందిన గుబ్బల శేఖర్ బాబు-యమున దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 11: కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అధిక సంఖ్యలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్/అన్నవరం, ఆగస్టు 11: తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నవరం రైల్వే స్టేషన్ 3వ నెంబరు ప్లాట్‌ఫామ్ శివారున గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనాస్థలాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ కోరారు.

ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు

నిరంతర కృషి

యూపీఈఐఎఫ్ న్యాయ సలహాదారు శ్రీవిజయ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవిజయ్

కాకినాడ రూరల్, ఆగస్టు 11: ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడ కోసం నిరంతరం కృషి చేస్తానని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) రాష్ట్ర న్యాయ సలహాదారు, హైకోర్టు న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. కాకినాడ అశోక్‌నగర్‌లోని ఎం ఎస్ఎన్ పాఠశాల ఆవరణలో యూపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫెడరేషన్ ఎప్పటికప్పుడు ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలపై పోరాటం చేస్తోందని, పాఠశాలల యాజమాన్యాలు విద్యారంగంలో పలు మార్పులు తీసుకురావాలని సూచించారు. కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ మాట్లాడుతూ సంఘం బలోపేతం కావాలంటే ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాల కరస్పాండెంట్ ఉన్నతమైన విలువలతో హుందాగా వ్యవహరించాలని సూచించారు. విద్యారంగ సమస్యలపై శ్రీవిజయ్ చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. అనంతరం పలు పాఠశాలల కరస్పాండెంట్లు లేవనెత్తిన సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించారు. సమావేశంలో ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి గుర్తింపు

కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగింత

అన్నవరం, ఆగస్టు 11: కాకినాడ జిల్లా అన్నవరం రైల్వే స్టేషన్‌లో ఒక బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి ప్రయాణికులు జీఆర్పీ హెచ్‌సీ శ్యామ్‌కు సమాచారమిచ్చారు. ఆయన హుటాహుటిన స్టేషన్‌కు వచ్చి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన పేరు గాజుల స్వామి అని, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి స్వగ్రామం అని, దగ్గర్లో ఉన్న రెస్టారెంట్‌లో పనిచేయమని తల్లిదండ్రులు అడిగితే ఇష్టంలేక బట్టలు సర్దుకుని వచ్చేశానని చెప్పాడు. అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ చెప్పారు.



ఏజెన్సీ సమాచారం

ప్రభుత్వ భవనాలు పూర్తయ్యేనా...?



బరదనాంపల్లిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం

రాజవొమ్మంగి ఆగస్టు 11: మండలంలో సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. 2020లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 18 భవనాలు నిర్మాణం ప్రారంభించగా ఇప్పటికి ఒక్క సచివాలయ భవనంమాత్రమే పూర్తి చేసి అధికారులకు అప్పగించారు. గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 2020లో మండలంలో 18 ప్రభుత్వ భవనాల నిర్మాణం ప్రారంభం కాగా ఇప్పటికే 16 పూర్తయ్యాయి. దీనిపై గతంలో జరిగిన అనేక మండల పరిషత్ సమావేశాల్లో అన్ని పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేశారు. అయితే అధికారుల పర్యవేక్షణాలోపంతోనే నిర్మాణాలు పూర్తి కాలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లకు సుమారు రూ.45లక్షల బిల్లులు పెండింగులో ఉన్నాయని, అందుకే వారు పనులు చేయట్లేదని పంచాయతీరాజ్ శాఖ రాజవొమ్మంగి ఇన్చార్జి జేఈ రవితేజ చెప్పారు.

శిథిలావస్థలో మోతుగూడెం పంచాయతీ కార్యాలయం



శిథిలావస్థలో ఉన్న మోతుగూడెం పంచాయతీ కార్యాలయం, నేటికీ పూర్తికాని సచివాలయ భవనం

మోతుగూడెం, ఆగస్టు 11: మోతుగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు భవనంలోని అన్ని గదులు కారుతుండడంతో అధికారుల బాధలు వర్ణనాతీతం. ముఖ్యమైన రికార్డులు, కంప్యూటర్, స్టేషనరీ, సామగ్రిపై ప్లాస్టిక్ కవర్లు కప్పి కాపాడుకుంటున్నారు. శిథిల భవనంలోనే సచివాలయ, పంచాయతీ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.42 లక్షలతో నూతన సచివాలయ భవన నిర్మాణ పనులను 2020 డిసెంబరు 11న ప్రారంభించారు. మూడు సంవత్సరాల 8 నెలలు కావస్తున్నా నేటికీ పూర్తి కాలేదు.

లీకవుతున్న నీరు... పరిష్కరించిన సర్పంచ్‌లు



గొట్టాలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

దేవీపట్నం, ఆగస్టు 11: దేవీపట్నం పంచాయతీ కృష్ణునిపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నీటి సమస్య తలెత్తింది. దేవీపట్నం, రమణయ్యపేట సర్పంచ్‌లు కుంజం రాజామణి, మడకం దుర్గ, వార్డు సభ్యులు వెంటనే స్పందించి దగ్గరుండి సమస్యను పరిష్కరించారు. గొట్టాలు పాడైపోయి నీరు లీకవుతుండడంతో మార్చి కొత్తవి వేయించారు. టీడీపీ నాయకులు సిద్దా సత్యనారాయణ, లంక హరిబాబు, గేదల సుబ్బారావు, లంక పోసిరావు, గేదల చినసుబ్బారావు, దొడ్డ సింహాద్రి పనులను పర్యవేక్షించారు.

హెర్బల్ లైఫ్ న్యూట్రిషన్ సెంటర్ ప్రారంభం



న్యూట్రిషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శీతంశెట్టి

రంపచోడవరం ఆగస్టు 11: స్థానిక అంబేడ్కర్ సెంటర్లో హెర్బల్ లైఫ్ న్యూట్రిషన్ సెంటర్‌ను మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, అరకు పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు వంతల రాజేశ్వరి ఆదివారం ప్రారంభించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కారం సురేష్‌బాబు, నాయకులు ఉంగరాల రాము, గణేష్, హరిబాబు, జనార్దన్, గల్లా సత్తిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

బురదమయంగా పాఠశాల ఆవరణ

రంపచోడవరం ఆగస్టు 11: గంగవరం మండలంలోని కొత్తాడ ఆశ్రమ బాలుర పాఠశాల ప్రాంగణం పూర్తిగా బురదమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. విద్యార్థులు కాలకృత్యాలకు 150 మీటర్లు బురద, తుప్పల్లో నడుచుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. ఐటీడీఏ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జనసేన దేవీపట్నం మండల శాఖ అధ్యక్షుడు చారపు వెంకటరాయుడు, నాయకుడు సూరిబాబు డిమాండ్ చేసారు. ఈ సమస్యను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రంపచోడవరం ఆగస్టు 11: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో రంపచోడవరంలో సుమారు 300 మందికి వైద్య సేవలు అందిచామని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద జీ మహారాజ్ తెలిపారు. వైద్యాధికారులు రాయుడు శ్రీనివాస్, సవత్ కుమార్ ప్రజలకు వైద్య సేవలందిచారు. పరమహంస యోగానంద నేత్రాలయం (వేమగిరి) ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందిని పరీక్షించి 25 మందికి కళ్లజోళ్లు అందించారు. శిబిర సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు, వలంటీర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!



గోతిలో దుంగను ఏర్పాటు చేసిన దృశ్యం

మోతుగూడెం, ఆగస్టు 11: మోతుగూడెం పరిధిలోని గొడ్లగూడెం-గోపాలపురం రహదారి మధ్యలో పెద్ద రంధ్రం పడింది. గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడవిలో వాగులు పొంగి పొర్లడంతో రోడ్లకు ఇరువైపులా కల్వర్టులు దెబ్బతిన్నాయి. గోపాలపురం గ్రామంలోని కల్వర్టువద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదభరితంగా మారింది. భారీ వాహనాలు వెళ్లే ఈ రోడ్డు మరింత కుంగిపోయే అవకాశం ఉంది. భద్రాచలం, విశాఖపట్నంలతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రాలైన మోతుగూడెం, పొల్లూరు, డొంకరాయి, సీలేరులకు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. అంతేగాక రోడ్డుకు ఇరుపక్కలా మొక్కలు ఏపుగా పెరగడంతో రోడ్డు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మోతుగూడెం భవ్య హాస్పిటల్ సీఎస్ అంబులెన్స్ గౌతమ్, ఏపీ ట్రాన్స్‌కో ఉద్యోగి కార్తీక్ పెద్ద దుంగను ఆ గోతిలో పెట్టి ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాడైన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించాలని వాహనచోదకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గరగలంపాలెం సారా బట్టీపై పోలీసుల దాడి

- 200 లీటర్ల సారా స్వాధీనం
- రెండు మోటార్ బైక్‌లు స్వాధీనం
- 3500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కోరుకొండ, ఆగస్టు11: కోరుకొండ మండలం గరగలంపాలెంలోని నాటుసారా తయారీ బట్టీలపై కోరుకొండ ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో గరగలంపాలెం శివారు పామాయిల్ తోటలో సారాబట్టీని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా 200 లీటర్ల సారాను, రెండు మోటార్ సైకిళ్లను, సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 3500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ బట్టీ ద్వారా సారా కాస్తున్న ముగ్గురు వ్యక్తులు సీతానగరం మండ లం అక్కియ్యపాలెంనకు చెందిన వారుగా గుర్తించామని, వారిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఈదాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో కోరుకొండ, సీతానగరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారని కోరుకొండ ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

రాజానగరం, ఆగస్టు 11: మండలంలోని గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు నేటి నుంచి మూడు రోజులపాటు రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో (గ్రేడ్-1నుంచి గ్రేడ్-5)వరకు శానిటేషన్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ ప్రూట్నీ, వీధిలైట్లు, తదితర అంశాలపై 1, 2 నుంచి 14 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఈశిక్షణకు విధిగా హాజరుకావాలన్నారు.

రంగా ప్రజల పక్షపాతి

- వంగవీటి విగ్రహావిష్కరణలో రాధాకృష్ణ



సీతంపేటలో రంగా విగ్రహావిష్కరణలో పాల్గొన్న వంగవీటి రాధ, ఎమ్మెల్యేలు ముప్పిడి, ఆదిరెడ్డి వాసు, బొలిశెట్టి శ్రీనివాసరావు

కొవ్వూరు, ఆగస్టు 11: వంగవీటి మోహన రంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారని, ఆయనను 3 దశాబ్దాలుగా గుండెల్లో నిలుపుకున్న అభిమానం మరువలేనిదని వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కొవ్వూరు మండలం సీతంపేటలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు ఇన్నిసార్లు ఎమ్మెల్యేగా పని చేశామని గొప్పలు చెప్పుకుంటారు కాని, రంగా 1985 నుంచి 88 వరకు మాత్రమే ఎమ్మెల్యేగా పనిచేసి కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారన్నారు. భవిష్యత్‌లో అందరూ కలసికట్టుగా ప్రయాణం చేయాలన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్, రంగా విగ్రహం లేని నియోజకవర్గాలు ఉండవన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రంగాను తానెప్పుడూ చూడలేదని, ఆయన పెంపకాన్ని చూస్తున్నానన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపులో వంగవీటి రాధ పాత్ర ఉందని, వాసు అందుబాటులో ఉండి సమస్యలు తీరుస్తాడని తెలిపారని ఆ విధంగానే నేడు పనిచేస్తున్నానన్నారు. భవిష్యత్‌లోను మీ కోసం ఆలోచించే వ్యక్తులను కాపాడుకోవాలన్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీహరిని ఉద్దేశించి మాట్లాడుతూ యువతను ఇబ్బంది పెట్టొద్దని, పడడం లేవడం తమకు అలవాటేనన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రంగా బతికుంటే ముఖ్యమంత్రి అయ్యి ఉండేవారన్నారు. దుర్మార్గపు రాజకీయ తంత్రంలో కులం మొత్తం నలిగిపోయిందని, రంగా కులానికి మతానికి నాయకుడు కాదు. బడుగు బలహీనవర్గాల కోసం పోరాడిన మహానుభావుడన్నారు. రంగా గారి ఆశయాలతో పనిచేస్తున్న పవన్‌కళ్యాణ్‌ను కాపాడుకోవాలన్నారు. కరాటం రాంబాబు, బండారు శ్రీనివాస్, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, ఎంపీపీ కాకర్లనారాయుడు, సర్పంచ్‌లు జెట్టి బంగారయ్య, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, రంగా, రాధ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనకు పోస్టర్ల ఆవిష్కరణ



క్యాన్సర్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు 11: కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్యాన్సర్‌పై అవగాహన కల్పించే దిశగా ఏర్పాటుచేసిన కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎక్కువమంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, దానిపై అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చిన పీఎంపీలను అభినందించారు. ఈనెల 15 నుంచి ప్రభుత్వం నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లలో ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. పీఎంపీ సమస్యలు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌ల దృష్టిలో ఉన్నాయన్నారు. టీడీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్ సుకుమార్, తోరాటి ప్రభాకరరావు, వీబీటీ రాజు, బళ్లా శ్రీనివాసరావు, పి.దేవా నందం, పి.చిన్ని, రహమాన్‌ఖాన్, మట్టా రమేష్, ప్రసాద్ బాబు, ఎం.జితేంద్ర పాల్గొన్నారు.

బిక్కవోలు ఎస్‌ఐ బదిలీ

బిక్కవోలు, ఆగస్టు 11: బిక్కవోలు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు బీఆర్. అంబేద్కర్ జిల్లా రాయవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శనివారం రాత్రి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. స్టేషన్ ఇన్‌చార్జిగా అనపర్తి సీఐ శివగణేష్ వ్యవహరిస్తున్నారు.

ఘనంగా రక్షాబంధన్ మహోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: స్థానిక సీటీఆర్‌ఐ రోడ్డులోని ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రక్షాబంధన్ మహోత్సవం రాజయోగిని బ్రహ్మకుమారి గీతామాధురి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో వరంగల్ సబ్‌జోన్ ఇన్‌చార్జి సవిలా బెహన్, బ్రహ్మకుమారీ సంస్థ భీమవరం ఇన్‌చార్జి బీకే రమాదేవి, బీకే సుధాకర్, బీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాగౌతమి రచయితల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనంద్ గార్డెన్స్‌లో ఆది వారం కళారచయితల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణమాస శోభపై కవితలు రాసిన రచయిత లను కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి అభినందించారు. కార్యదర్శి వీవీబీ సంజీవరావు మా ట్లాడుతూ కళాగౌతమి స్థాపించి 30 ఏళ్లయిన సందర్భంగా ఈనెల 27,28,29 తేదీల్లో వేడుకలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సప్పా దుర్గాప్రసాద్, వీవీ సుబ్రమణ్యం, ఎల్.శ్రీని వాసరాజు, భమిడిపాటి భీమశంకరం పాల్గొన్నారు.

సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనం

రాజమహేంద్రవరంఅర్బన్, ఆగస్టు 11: సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరుగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకే దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వరంగంలోని రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు విశాఖపట్నంలో జరిగే జాతీయ సమితి సమ్మేళనంలో దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, అల్యూమినియం వర్కర్స్ యూనియన్ నాయకుడు కొండలరావు, సుబ్బారావు, పేపర్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

రాజమహేంద్రవరంరూరల్, ఆగస్టు 11: రాజమహేంద్రవరం ఆర్‌సీఎం ఎయిడెడ్ స్కూల్‌లో 2003-04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలయిక ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణా, కర్ణాటక, చెన్నై తదితర రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ఇరవై ఏళ్ల తరువాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య బోధించిన హెచ్‌ఎం అక్బర్‌తో పాటు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తాము అందర్ని ఒకచోటికి చేర్చిన మిత్రులు పి.ఎజ్రా, ఎస్.లోవరాజు, మారుతి, టి.బుజ్జి, వి.కిషోర్, ఆర్.నాగజ్యోతి, కె.ప్రజ్ఞ, వి.స్వర్ణదేవి, బి.దివ్యలను మిత్రులంతా అభినందించారు.



ఆర్‌సీఎం స్కూల్‌లో కలిసిన పూర్వవిద్యార్థులు

వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి

- పంచ సప్తతి కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి నుంచి మహానేత పుస్తకం అందుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఆగస్టు 11: మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్యనాయుడు 75 వసంతాల ప్రజా జీవన ప్రయాణం సందర్భంగా ఆదివారం విజయవాడలోని మురళి రిసార్ట్‌లో ఏర్పాటుచేసిన పంచ సప్తతి కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంకయ్య నాయుడి ప్రజాజీవితంపై రచించిన మహానేత పుస్తక ప్రతిని వెంకయ్య చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ ఉదయగిరి నుంచి ఉప రాష్ట్రపతి వరకు ఎదిగిన వెంకయ్యనాయుడిని ప్రతి రాజకీయ నాయకుడు ఆదర్శం గా తీసుకోవాలని అన్నారు. ప్రజా జీవితంలో నీతీ నిజాయతీలతో ఆయన సాగించిన పయనమే ఆయనను ఆ స్థాయికి చేర్చిందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని నల్లమిల్లి అన్నారు.

హర్‌ఘర్ తిరంగాలో అందరూ భాగస్వామ్యులు కావాలి

- బీజేపీ రాజానగరం నియోజకవర్గ కోకన్వీనర్ అడబాల

దివాన్‌చెరువు, ఆగస్టు11: హర్‌ఘర్ తిరంగాలో అందరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాజానగరం నియోజకవర్గ కోకన్వీనర్ అడబాల గణపతిరావు కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. దేశప్రజలకు దేశభక్తిని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. తిరంగా యాత్రపేరిట నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో మంగళవారం 50 అడుగుల జాతీయపతాకంతో కళాశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అలాగే 14న విభజన విభీషణ సంస్మరణ దివాస్‌ను పురస్కరించుకుని జిల్లాస్థాయి సమావేశం రాజమహేంద్రవరంలో జరుగుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈనెల 13నుంచి 15వ తేదీ మధ్య ప్రతీ ఇంటిపై జాతీయపతాకాన్ని ఎగురవేసి సెల్ఫీఫోటోలను సరళయాప్‌లో అప్‌లోడ్‌చేయాలని గణపతిరావు కోరారు.



బంగారు వరలక్ష్మి కానుక లక్కీడ్రా తీస్తున్న కంబాల శ్రీనివాసరావు

92 మందికి బంగారు వరలక్ష్మి కానుక

గోకవరం, ఆగస్టు11: గోకవరంలోని సూర్య కళ్యాణ మండపంలో ఆదివారం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బంగారు వరలక్ష్మి కానుక-2 లక్కీ డ్రా నిర్వహించారు. సుమారు 4 వేల మందికి పైగా మహిళలు హాజరుకాగా లక్కీ డ్రాలో 92 మంది మహిళలు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఒక్కొక్కరికీ రూ.7,500లు విలువజేసే ఒక గ్రాము బంగారు వరలక్ష్మి డాలర్ (రూపు)ను శ్రీనివాసరావు అందజేశారు.అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 5 ప్రాంతాల్లో బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా నిర్వహించామన్నారు. రంపచోడవరంలో 47 మందికి, కోరుకొండలో 48 మందికి, ఇందుకూరుపేటలో 35 మందికి, శ్రీరంగపట్నంలో 50 మందికి, గోకవరంలో 92 మంది విజేతలకు బంగారు రూపులను అందజేశామన్నారు.కార్యక్రమంలో గ్రామపెద్ద దాసరి తమ్మన్నదొర, రామసేన సభ్యుడు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనగోటి బాపన్నదొర, వల్లూరి జగన్నాధశర్మ, వరసాల ప్రసా ద్ పాల్గొన్నారు.

స్కావెంజర్ల సర్వే జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: మాన్యువల్ స్కావెంజర్ల సర్వే జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో నలుగురు సభ్యులుంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వారి కోసం పనిచేసే సంఘాల్లోని ఇద్దరు ప్రతినిధులు ఉం టారన్నారు. ఈ నలుగురిలో ఒక మహిళ సభ్యురాలిగా ఉంటారన్నారు. నిబంధనలు అనుసరించి ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో ఈనెల 13వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత కార్యాలయం, సబ్ కలెక్టరేట్ ప్రాంగణం రాజమహేంద్రవరంలో దరఖాస్తులను అందించాలని కోరారు. సమాచారం కోసం 7993499820లో సంప్రదించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్-ఉపాధి కల్పన-అవకాశాలపై సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: విద్యార్థులు కూడా బడ్జెట్ మీద అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ నుంచి యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య అన్నారు. రాజమండ్రి ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మోడల్ కాలనీలోని యూనియన్ భవన్‌లో కేంద్ర బడ్జెట్-ఉపాధి కల్పన-అవకాశాలపై ఆదివారం నిర్వహించిన సదస్సు ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా, వైద్యం, మౌలిక వసతుల ప్రాజెక్టుకు ఎక్కువ మొత్తాల్లో కేటాయించడం ద్వారా నైపుణ్యం కలిగిన, లేని కార్మికులకు ఉద్యోగ అవకాశాలను సృష్టించవచ్చన్నారు. ఈ కారక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, ప్రధా న కార్యదర్శి ఎం.కోదండరామ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు ఎ.సుబ్బారావు, ఎస్.గనెయ్య, ఏకే.విశ్వనాథ్, బి.శ్రీనివాస్, ఐవీ సుధాకర్, జి.శ్రీనివాస్, వి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బయో పోర్టిఫైడ్‌పై కేవీకేలో అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు

రాజానగరం, ఆగస్టు 11: కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ రాజమహేంద్రవరం, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలో బయో పోర్టిఫైడ్, వాతావరణ అనుకూల పంటల రకాలపై రైతులకు, వ్యవసాయ విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్)విడుదల చేసిన రకాల్లో 69 క్షేత్ర పంటలు, 40 ఉద్యాన పంటల రకాలు ఉన్నాయన్నారు. బయోపోర్టిఫికేషన్ అనేది జన్యుమార్పు ద్వారా అవసరమైన పోషకాలను అధికస్థాయిలో కలిగి ఉండేలా ప్రధా నమైన పంటలను ఉత్పత్తి చేసే ప్రక్రియ సాధారణ ఫోర్టిఫికేన్‌లో ఆహార పదార్థాలకు ఫుడ్ ప్రొసెసింగ్ విధానంలో విలువ జోడింపు ద్వారా పోషకాలను పెంచుతారన్నారు. బయోపోర్టిఫికేషన్ అనేది మొక్కలు పెరుగుతున్నప్పుడు మొక్క ఆహారాన్ని మరింత పోషక మైనదిగా చేయడంపై దృష్టి పెడుతుందన్నారు. బయోఫోర్టిఫైడ్, వాతావరణ అనుకూల పంట రకాలను త్వరితగతిన అందుబాటు లోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవీకే వివిధ విభాగాల సాంకేతిక అధికారులు సత్యవాణి బి.నాగేశ్వరరెడ్డి, రవీంద్ర, రఘునందన్, సంజయ్‌లతో రాజానగరం, కోరుకొండ మండలాలకు చెందిన రైతులు, రైతు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యం చాటుకున్న పోలీసులు

- సహోద్యోగికి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం



శ్రీనివాస్ భార్యకు చెక్కు అందజేస్తున్న సహోద్యోగులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు మరోసారి ఐకమత్యం చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సహోద్యోగికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. సాయుధ రిజర్వు కార్యాలయంలో వి.శ్రీనివాస్(పీసీ 606) కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఇది గమనించిన సాయుధ రిజర్వు, మోటార్ ట్రాన్స్‌పోర్టు సిబ్బంది కలిసి సేకరించిన రూ.2.50 లక్షలను ఆదివారం శ్రీనివాస్ భార్యకు అందించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఉదారత చూపిన సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు. శాఖలోని అందరూ పోలీసు కుటుంబమనే స్ఫూర్తినిచాటారని ప్రశంసించారు. బాధిత కానిస్టేబుల్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ రవికుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రఘురాం పాల్గొన్నారు.

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ముగ్గురు సీఐలు



రాజానగరం ప్రసన్నవీరయ్యగౌడ్, బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన ముగ్గురు సీఐలు ఆదివారం ఆయా స్టేషన్లలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ నరసింహకిషోర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. రాజానగరం సీఐగా ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, బొమ్మూరు సీఐగా పి.కాశీవిశ్వనాథ్, ధవళేశ్వరం సీఐగా తిప్పా గణేశ్ చార్జి తీసుకున్నారు. ముగ్గురు సీఐలకూ గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. వీరయ్య గౌడ్ త్రీటౌన్, కాశీ విశ్వనాథ్ రాజానగరం, టూటౌన్ సీఐగా గణేశ్ విధులు నిర్వర్తించారు.

ధవళేశ్వరం సీఐగా గణేష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ గణేష్

ధవళేశ్వరం, ఆగస్టు 11: ధవళేశ్వరం సీఐగా టి.గణేష్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వహించిన వినయ్‌మోహన్ వీఆర్‌లోకి వెళ్లారు. గతంలో ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన గణేష్ రాజమహేంద్రవరం టూటౌన్ సీఐగా పనిచేసి విజయవాడకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన సీఐ గణేష్‌ను సిబ్బంది, గ్రామప్రముఖులు అభినందించారు.

వైఎంవీఏ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: సమాజహిత కార్యక్రమాల్లో యంగ్ మెన్ వైశ్య అసోసియేషన్(వైఎంవీఏ) నూతన కమిటీ రాణించాలని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక గోదావరి బండ్ వైఎంవీఏ హాలులో ఆదివారం వైఎంవీఏ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి సుబ్రహ్మణ్యం, ఎంపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కూసుమంచి సుబ్బరాయలు ముఖ్యఅతిథులుగాను, జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు గౌరవఅతిథిగాను విచ్చేశారు. 2024-25 సంవత్సరానికి అధ్యక్షుడిగా మైలవరపు శ్యామలరావు, కార్యదర్శిగా కన్నెగొళ్ళ రవికాంత్, కోశాధికారిగా కొత్త వెంకటకిషోర్, ఉపాధ్యక్షులుగా బొండాడ ప్రభాత్, అప్పన్న షణ్ముఖ్ రంగరాజు, తోట లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు గొల్లపూడి నాగేంద్రకుమార్, బత్తుల సిద్ధార్థ, కారుమూరి చరణ్‌తేజ్‌తోపాటు పలు విభాగాలకు కార్యదర్శులు, పలువురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. వారందరితో ప్రమాణస్వీకారం చేయించారు. సుబ్రహ్మణ్యం నూతన కార్యవర్గాన్ని అభినందించి సత్కరించారు. అనంతరం 60మంది వైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించారు. కార్యక్రమంలో మండవిల్లి శివ , సత్యవరపు గోకుల మురళి, ఇన్నమూరి రాంబాబు, ఇన్నమూరి దీపు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో కిక్ బాక్సింగ్ పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 31వ ఏపీ రాష్ట్ర కిక్ బాక్సింగ్ పోటీలను టీడీపీ రాష్ట్ర హెల్త్‌విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ప్రారంభించారు. ఆదివారం జాతీయ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ కె.అగర్వాల్, రాష్ట్రాధ్యక్షుడు జి.ఆనంద్‌బాలు, రాష్ట్ర కార్యదర్శి పి.ఆనంద్ ఆచార్య, రాజమండ్రి చైర్మన్ రొంపిచర్ల ఆంటోనిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరామ్ కిరణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో శీలం గోవింద్, ఎం.గణేష్, ఎస్.గిరి వెంకటరమణ, స్టేట్ కోచ్ ఎం.భవానీశంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామదేవతలు పుస్తకావిష్కరణ



చల్లా సత్యవాణి విరచిత గ్రామదేవతలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: స్థానిక కోర్లమ్మపేట, కోర్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ రచయిత్రి చల్లా సత్యవాణి రచించిన గ్రామదేవతలు పుస్తకాన్ని రాష్ట్రపతి పురస్కార గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి ఆదివారం ఆవిష్కరించారు. గౌరవాధ్యక్షుడిగా పాల్గొన్న గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ సత్యవాణి ఏ పుస్తకం రాసినా సమాజానికి ఎంతో మేలు చేకూరేవిగా ఉంటాయని, ఈ 38వ పుస్తకం గ్రామదేవతలు వెలసిన వివిధ ప్రదేశాల చారిత్రాత్మక గొప్పదనాన్ని చదువరులందరికీ ఎంతో ఉపయోగప డేలా రాశారని కొనియాడారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం భక్తులకు ఒక గైడ్‌లా ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్, సమాచారమ్ రాఘవరావు, తేతలి ఉమామహేశ్వరి, ప్రభాకరరావు, జయప్రద, కె.శ్రీనివాస్, మణి పాల్గొన్నారు.



మరో ముగ్గురు తహశీల్దార్లకు పోస్టింగ్‌లు

రాజమహేంద్రవరం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో ముగ్గురు తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు దేవరపల్లి తహశీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి, రాజానగరం తహశీల్దార్‌గా ఎన్.లక్ష్మీలావణ్య,రాజమహేంద్రవరం కెఆర్‌ఆర్ స్పెషల్ తహశీల్దార్‌గా డి.సుగుణలను నియమించారు. ఇటీవల 17 మందికి పోస్టింగ్‌లు ఇచ్చిన సంగతి తెలిసిందే.ఈ ముగ్గురిని కలిపితే 20 మంది తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

జైలు పక్షుల.. కలత తీరేనా!



- స్వాతంత్ర్య దినోత్సవంపై ఆశలు
- 2019లో చంద్రబాబు హామీ
- ఈ సారి నెరవేరుస్తారని ఆశ
- సెంట్రల్ జైలు ఖైదీలు 1250
- 66 మందికి అవకాశం
- జైలు అధికారుల నివేదిక
- కూటమి నిర్ణయమే తరువాయి
- నాడు క్షమాభిక్ష పెట్టని జగన్
- ఐదేళ్లూ ఖైదీలకు అన్యాయం



‘ సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏమాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే ’

- దేశ సర్వోన్నత న్యాయస్థానం.

క్షమాభిక్షకు ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. రాజకీయ కక్ష సాధింపుతోనే జగన్ ఐదేళ్ల పాలన సరిపెట్టారు. వైసీపీ పాలకులు కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకుంటూ..ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబం తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోయేవారు. ఖైదీల పిల్లల ఆవేదన అయితే మాటల్లో వర్ణించలేం. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం రావడంతో మళ్లీ తమకు ఏ ఇబ్బందులూ లేకుండా క్షమాభిక్ష జీవోలు క్రమం తప్పకుండా వస్తాయని ఖైదీల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదలకు ఆశగా ఎదురు చూస్తున్నారు.

2019లో చంద్రబాబు హామీ ఇచ్చినా..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఇబ్బంది లేకుండా క్షమాభిక్ష జీవోలు సమయానుకూలంగా జారీ అయ్యేవి. వీటికి రాజకీయ లబ్ధితో లింకు ఉండేది కాదు. అప్పట్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. ‘మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోలకు ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను’ అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో చంద్రబాబుకు క్షమాభిక్ష పెట్టే అవకాశం లేకుండా పోయింది. అయినా చంద్రబాబు గతేడాది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు తమ గోడు వినిపించుకోడానికి ఖైదీలు ప్రయత్నించినా కుదరలేదు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. దీనికీ మెలిక పెట్టడంతో చాలా మంది ఖైదీలకు అన్యాయం జరిగింది. జైలు అధికారులు ఎంతో ప్రయాసపడి వేగంగా ప్రక్రియ పూర్తి చేసి జాబితా పంపించినా హైపవర్ కమిటీ, ప్రభుత్వం వద్ద నెలల తరబడి తాత్సారం చేయడం జరిగేది. సుప్రీం కోర్టు నిర్దేశాలపై సైతం పట్టింపు లేకుండా వ్యవహరించారు.ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతేడాది రెండు ఫేజుల్లో విడుదల కావాల్సిన జాబితా పెండింగ్‌లోనే ఉంది.మొదటి ఫేజ్‌లో 141, రెండో ఫేజ్‌లో 29 మందితో కూడిన జాబితాను జైళ్ల అధికారులు ఉన్నతాధికారులకు పంపించి నెలలు గడుస్తున్నా ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఈలోపు కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో చంద్రబాబు ఆనాటి హామీని ఖైదీలు గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో ఉన్న ఖైదీలు ఆగస్టు 15వ తేదీకి విడుదలయ్యేలా జీవో వస్తుందని ఎదురుచూస్తున్నారు.

సెంట్రల్ జైలులో 66 మంది..

ఈ స్వాతంత్ర్య దినోత్సవానికి విడుదల చేయడానికి వీలుగా కూటమి ప్రభుత్వం జీవో ఇస్తే రాష్ట్రంలోని రాజ మహేంద్రవరం,విశాఖపట్నం, కడప, నెల్లూరు సెంట్రల్ జైళ్లతో పాటు వివిధ కారాగారాల్లో శిక్ష అనుభవిస్తున్న మొత్తం 170 మంది ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ కుటుంబాల చెంతకు చేరుతారు.వీరిలో మహిళా ఖైదీలు ఉన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ప్రస్తుతం 1250 మంది ఖైదీలు ఉన్నారు. వీరిలో 450 మంది జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. క్షమాభిక్షకు 44 మంది ఎదురు చూస్తున్నారు. మహిళా ప్రత్యేక జైలులో 80 మంది ఖైదీలు ఉండగా 22 మంది క్షమాభిక్ష జాబితాలో ఉన్నారు. ప్రభుత్వం జీవో ఇస్తే స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు జైళ్లలో కలిపి 66 మంది స్వేచ్ఛా వాయువులు పీల్చుకోనున్నారు. సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత మహిళా ప్రత్యేక జైలును సందర్శించనున్నారు. సుప్రీంకోర్టు నిర్దేశాల ప్రకారం ప్రత్యేక రోజులతో సంబంధం లేకుండా క్షమా భిక్షపై విడుదల చేయవచ్చు.కానీ గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలు,గాంధీ జయంతికి విడుదల చేయడం సంప్రదాయంగా వస్తోంది.

క్షమాభిక్షలోనూ జగన్ మెలిక

టీడీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. కనీసం రెండేళ్లకు ఒకసారైనా పెద్ద సంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. తమ కుటుంబాల చెంతకు చేరి కొత్త జీవితం ప్రారంభించేవాళ్లు. కానీ జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో మగ్గిపోయారు. ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీల విడుదల జరిగింది. అప్పుడు రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలు,మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మందికిపైగా ఖైదీలు బయటకు వెళ్లారు. దానిలోనూ ఖైదీలకు అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే..2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు. దీంతో ఆ ఖైదీలు వైసీపీ ప్రభుత్వం వల్ల ఏడాది శిక్ష అదనంగా అనుభవించాల్సి వచ్చింది.

కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7 ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హులవుతారు.ఇంకా కొన్ని నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. జైలులో 15 ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్(సత్ప్రవర్తనకు కల్పించే ఉపశమనం)తో కలుపుకొని 20 ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65 ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవోల జారీపై తీవ్ర నిర్లక్ష్యంతో సుప్రీం, సామాజిక నిపుణుల ఉద్దేశం సైతం నీరుగారిపోతోంది. కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఆర్థిక, కుటుంబ పరిస్థితులు, ఖైదీ సత్ప్రవర్తన ప్రధా నంగా దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతున్నారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం ఆదేశాలతో సమయానుగుణంగా నిబంధనలను అనుసరించి విడుదల చేయాల్సి ఉంటుంది. ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష ప్రసాదించాలి. మొదటి ఫేజుకు జూన్ 1,రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా జీవోలో పేర్కొన్నారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తిచేయాలి.ఫేజ్1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా,ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీ లను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవా లి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది. అంటే ఫేజ్ 1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి 1, ఫేజ్3కి జూన్ 1లోగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలి.

ఆర్డర్ వస్తే.. విడుదల చేస్తాం..



ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే తదుపరి ప్రక్రియ పూర్తి చేసి విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సిబ్బందికి ఇప్పటికే ఈ మేరకు సూచించడం జరిగింది. కొత్త ప్రభుత్వం వచ్చిన విషయం తెలిసిందే. అందువల్ల రెండు ఫేజుల జాబితా మళ్లీ ప్రభుత్వానికి వెళ్లే అవకాశం ఉంది. ఏదేమైనా జీవో త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాం.


- రవికిరణ్,జైళ్ల శాఖ డీఐజీ, కోస్తాంధ్ర ప్రాంతం

అన్నదాతకు తీపి కబురు

నేడు రైతుల ఖాతాలకు ధాన్యం బకాయి సొమ్ము

రూ. 27.71 కోట్లు విడుదల చేసిన కూటమి





కలెక్టర్ విడుదల చేసిన చెక్

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అన్నదాతకు తీపికబురు చెప్పింది.. ప్రభుత్వం మారడంతో ధాన్యం విక్రయించిన సొమ్ములు అసలు వస్తాయో రావో తెలియక రైతులు అయోమయం పడిపోయారు. అయితే కూటమి ప్రభు త్వంపై నమ్మకంతో నేటి వరకూ రైతులు ధాన్యం బకాయిలపై నోరుమెదపలేదు. అయితే సీఎం చంద్రబాబు మాత్రం రైతుల ధాన్యం బకాయిల చెల్లింపునకు ఆదేశాలు విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి ధాన్యాన్ని పండించే రైతులను గత వైసీపీ ప్రభుత్వం అష్టకష్టాల పాల్జేసింది. గతేడాది ఖరీఫ్‌లో ధాన్యం అమ్మకాలకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంత ధాన్యం వర్షానికి దెబ్బ తినగా, మంచి ధాన్యాన్ని కొనకుండా తాత్సారం చేశారు. అప్పట్లో ఇప్పటి సీఎం, అప్పటి ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు స్వయంగా పొలాల్లో తిరిగి రైతులకు భరోసా కల్పించారు. ధాన్యాన్ని వెంటనే కొనకపోతే తాడేపల్లి ప్యాలెస్‌ను రైతులతో కలిసి వచ్చి ముట్టడిస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. తర్వాత ప్రస్తుత ఉపముఖ్యమంత్రి, జనసేన నేత పవన్ కల్యాణ్ కూడా రైతుల వద్దకు నేరుగా వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంత వరకూ ధాన్యం కొనుగోలు చేశారు. రబీ సీజన్‌లో ఎన్నికల సమయంలో కూడా రైతులను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. జిల్లాలో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం పండితే గత ప్రభుత్వం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా కేవలం 2,28,423 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. దానికి కూడా పూర్తిగా డబ్బు ఇవ్వలేదు. ఎన్నికల ముందు కొంత మాత్రం ఇచ్చింది. జిల్లాలో మొత్తం 22,605 మంది రైతులు ధాన్యం విక్రయించగా వీరికి రూ.498.65 కోట్లు చెల్లించాల్సి ఉంది. వారిలో కొంతమందికి మాత్రమే చాలా ఆలస్యంగా వారి ఖాతాల్లో కొంత సొమ్ము జమ అయింది. ఎన్నికల పోలింగ్.. కౌంటింగ్‌కు మధ్య అధికారులు కొంత జమ చేయించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.200 కోట్ల బకాయి ఉండిపోయింది. దీంతో రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు.ఈ మేరకు 1147 మంది రైతులకు సంబంధించిన రూ 27.71 కోట్లు బకాయి ఉండిపోయింది. ఈ సొమ్మును సోమవారం రైతుల ఖాతాలో జమచేయనున్నారు.జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం రైతులకు జమ చేయడానికి ముందుగానే చెక్ సిద్ధం చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం రైతుల సమక్షంలో బకాయిలను జమచేస్తారు.

కేటుగాడు..చిక్కాడు!



మంచితనం ముసుగు వేసుకున్నాడు.. మూడు నెలలుగా నమ్మించాడు.. సమయం చూసి గత నెల 30వ తేదీన ఇద్దరు బాలికలను ఎత్తుకుపోయాడు.. కంగారుపడిన తల్లి పోలీసులను ఆశ్రయించినా వాళ్లేం కంగారుపడలేదు.. భయపడిన తల్లి శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం వెళ్లి టీడీపీ నాయకుడు వర్మను కలిసింది.. అంతే పోలీసుల్లో అప్పుడు కంగారొచ్చింది.. రెండు రోజుల్లోనే బాలికలను ఎత్తుకుపోయిన కేటుగాడిని పట్టేశారు.. సోమవారం కేసు వివరాలను వెల్లడించనున్నారు..

- వివరాలు 8లో

సొసైటీలు నిర్వీర్యం

- ఐదేళ్లూ గాలికొదిలేసిన వైసీపీ
- నామినేటెడ్‌గా పదవులు కేటాయింపు
- త్రీమెన్ కమిటీల పేరుతో నిర్వహణ
- అవకతవకలమయంగా సొసైటీలు
- ఎన్నికలు జరపాలని డిమాండ్
- కూటమిపై రైతుల ఆశలు

కోరుకొండ, ఆగస్టు 11 : నామినేటెడ్ పోస్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సొసైటీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని నాయకులు ఎదురుచూస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అంతా ఇంతా డిమాండ్ కాదు.. ఆ పదవులు కోసం ప్రత్యేకంగా ఎదురుచూసేవారు.. సమర్థులైన వారు ఎన్నికయ్యేవారు.. సొసైటీలను బలోపేతం చేసేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను నిర్వీర్యం చేసి రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చివేసింది. సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి చాలా ఏళ్లయింది. ఆరంభంలో మూడేళ్లకోసారి సహకార సంఘాల ఎన్నికలు జరిగేవి. 2014కు ముందు సహకార సంఘాలకు ఎన్నికలు సజావుగా సాగేవి. రాష్ట్ర విభజన తరువాత సొసైటీ ఎన్నికలను మర్చిపోయారు. 2018లో సహకార సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి టీడీపీ ప్రభుత్వం సహకార సంఘాల పాలక మండలి పదవీ కాలాన్ని ఆరునెలల చొప్పున మూడుసార్లు పొడిగించారు. తదుపరి 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సహకార వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేసింది. గడచిన ఐదేళ్లలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోగా వాటిని రాజకీయ పునరావాస కేంద్రాలుగా తయారు చేసింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతులు భాగస్వాములుగా డైరెక్టర్లను ఎన్నుకుంటారు. డైరెక్టర్లు అంతా కలిసి సంఘానికి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. రైతుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించేవారని సంఘ అధ్యక్షులుగా ఎన్నుకునేవారు. గత వైసీపీ పాలనలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. త్రీమెన్ కమిటీల పేరుతో ఏడాదిన్నరకు సొసైటీకి ముగ్గురిని నామినేట్ చేస్తూ గత ఐదేళ్లలో మూడు సార్లు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. ఇతర మాజీలకు సొసైటీల్లో ముగ్గురు చొప్పున నామినేట్ చేసేవారు. దీంతో సహకార వ్యవస్థ లక్ష్యం దెబ్బతింది. రైతులతో ఏ మాత్రం ప్రమేయం లేకుండా వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యేలకు అనుచరులుగా పని చేసే వారికి సహకార సంఘ అధ్యక్ష పదవులు కట్టబెట్టింది. దీంతో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగాయి. దీనికి శ్రీరంగపట్నం సొసైటీ ఒక ఉదాహరణ. కోరుకొండ మండలంలో గల శ్రీరంగపట్నం, బూరుగుపూడి,దోసకాయలపల్లి, గాడాల, కోరుకొండ సొసైటీలు ఉన్నాయి. గత వైసీపీ పాలనలో ఒక్కో సొసైటీకి ముగ్గురు చొప్పున మూడు దఫాలుగా 9 మందికి రాజకీయ పునరావాసం కల్పించింది. మొత్తం 5 సొసైటీల్లో 45 మందికి త్రీమెన్ కమిటీల పేరుతో పదవులు కట్టబెట్టింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పూర్వవైభవం తీసుకురా వాలని.. ఎన్నికలు నిర్వహించాలని రైతాంగం కోరుతున్నారు.





సూచనలు చేస్తున్న ఎస్పీ

సీసీ కెమెరాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ రూంలోని సీసీ కెమెరాల ఫుటేజీని ఆదివారం పరిశీలించారు. కంట్రోల్ రూం ఇన్‌చార్జి సీఐ జి.ఉమామహేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉన్న 481 సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని నేర నియంత్రణకు కృషి చేస్తామని ఎస్పీ చెప్పారు. ఈ క్రమంలో నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ ఇల్లు, కార్యాలయాలు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నేడు హోంమంత్రి అనిత రాక

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఉదయం 9 గంటలకు తహశీల్దారు కార్యాలయం వెనుక నూతనంగా నిర్మించిన సెంట్రల్ జైలు పెట్రోలు బంకును ప్రారంభిస్తారు. తర్వాత మహిళా ప్రత్యేక జైలు, కేంద్ర కారాగారాన్ని పరిశీలిస్తారు. కేంద్ర కారాగారంలోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తారు.అనంతరం జైలు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్ ప్రారంభిస్తారని కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ తెలిపారు.హోంమంత్రి పర్యటన ఏర్పాట్లను హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ సోమవారం ఉదయం పరిశీలిస్తారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11 : ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి అధికారులంతా పాల్గొంటారన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ,ఆర్‌డీవో, మండల పరిషత్ కార్యాల యాల్లోనూ ప్రజాసమస్యల పరిష్కారవేదికను అధికారులు నిర్వహిస్తారన్నారు. ఈ మేరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు.

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు



నిడదవోలు, ఆగస్టు 11 : శ్రావణ మా సం తొలి ఆదివారం సందర్భంగా నిడద వోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి విశేష పూజలు చేశారు. అమ్మ వారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహా రతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుం కుమ పూజలు నిర్వహించారు. అనంత రం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించు కుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,25,211లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పరిశుభ్రతపై నిర్లక్ష్యం

వాటర్ ట్యాంకుపై మొలుస్తున్న మొక్క

మురుగునీటిలో గేట్ వాల్వ్



మురుగునీటిలో ఉన్న గేట్ వాల్వ్



కుకునూరులో వాటర్ ట్యాంక్‌పై మొలిచిన మొక్క

తాళ్లపూడి, ఆగస్టు 11 : తాళ్లపూడి పంచా యతీ పరిధిలోని కుకునూరు గ్రామంలోని వాటర్ ట్యాంకుకు మరమ్మతులు జరగడం లేదు. అందుకు ట్యాంకుపై పెరిగిన మొక్కే సాక్ష్యం. ట్యాంకు నుంచి నీటిని విడుదల చేసే గేట్ వాల్వ్ సైతం మురుగు నీటిలో ఉండడం గమనార్హం. ట్యాంకు పరిసర ప్రాంతమంతా డ్రైనేజీ వ్యవస్థ లేక ఎన్నో ఇబ్బందులు గురవుతున్నామని ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆ ప్రాంత వాసులంతా వాపోతాన్నారు.

'స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతోనే సాధ్యం'

దేవరపల్లి, ఆగస్టు 11: మన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేయడానికి సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. దేవరపల్లిలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకుని సర్వనాశనం చేశారని విమర్శించారు. నారా లోకేశ్ రెడ్‌బుక్‌లో నమోదు చేసిన వైసీపీ నాయకుల అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం ఖాయమన్నారు. చెట్లు నరకడం, పరదాలు ఏర్పాటు చేసుకోవడం రాష్ట్రంలో ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. చంద్రబాబుకు కూటమితో కలిపి ప్రజలు బ్రహ్మరథం పట్టారని రాష్ట్రానికి ప్రత్యేక నిధులు తేవడంతో పాటు పరిశ్రమలు కూడా తీసుకొచ్చి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతారని ఆయన అన్నారు.

సూర్యనారాయణుడికి అభిషేకాలు



కొవ్వూరు, ఆగస్టు 11: భానుసప్తమి సందర్భంగా కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలో గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయార్చకులు స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. పట్టణానికి చెందిన పొట్రు మురళీకృష్ణ, శమంతకమణి, చంద్రశేఖర్, కాత్యాయణి, హంసినీ లక్ష్మీలు సుబ్రహ్మణ్యస్వామికి నిత్య పాల కావిడి కైంకర్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి తహశీల్దార్‌గా రాజ్యలక్ష్మి



దేవరపల్లి, ఆగస్టు 11: దేవరపల్లి తహశీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కొయ్యలగూడెం తహశీల్దార్‌గా పనిచేసి దేవరపల్లికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఆచార్య బదిలీపై వెళ్లడంతో డీటీ శ్రీనివాస్ ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజ్యలక్ష్మి అన్నారు.

పైడిమెట్టలో ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

తాళ్లపూడి, ఆగస్టు 11: పైడిమెట్ట గ్రామంలో టీడీపీ నాయ కుడు, మాజీ ఎంపీపీ కొప్పాక కోటేష్ సతీమణి ఇటీవల మృతి చెందారు. దీంతో కోటేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. అనంతరం పెద్దేవంలో మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు మద్దుకూరి గంగాధర్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, దాయన రామకృష్ణ, నాయుడు హనుమంతరావు, పసలపూడి పుష్పరాజు, కోడి శంకరం, తిగిరిపల్లి గోపి పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన సుబ్బరాయచౌదరి



కొవ్వూరు, ఆగస్టు 11: టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆదివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్‌కు పుష్పగుచం అందించి అభినందించారు. నియోజకవర్గంలో పార్టీ విషయాలపై చర్చించారు.

రాజమహేంద్రవరంలో జేసీ మాల్ షోరూం

ప్రారంభించిన సినీ నటి శ్రీలీల, మంత్రి దుర్గేష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి శ్రీలీల, మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులో ఏర్పాటు చేసిన జేసీ మాల్ ఫ్యాషన్ షోరూంను ఆదివారం ప్రముఖ వర్ధమాన సినీతార శ్రీలీల, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. వస్త్ర ప్రపంచంలో తలమానికంగా అలరారుతున్న ఇంత పెద్ద షాపింగ్ మాల్‌ను రాజమహేంద్రవరంలో ప్రారంభించిన జేసీ యాజమాన్యాన్ని మంత్రి దుర్గేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. సంస్థ చైర్మన్ మాట్లాడుతూ జేసీ సంస్థ ఇప్పటికే తెలంగాణాలో పలు ఫ్యాషన్ మాల్స్ ప్రారంభించామని, అవన్నీ కస్టమర్ల అభిమానాన్ని, ఆదరణను చూరగొన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా రాజమహేంద్రవరంలో ప్రారంభించామని చెప్పారు. సినీనటి శ్రీలీల మాట్లాడుతూ జేసీ మాల్ ఫ్యాషన్ షోరూంలను తెలంగాణాలో చూశామని, ముచ్చటైన కలర్స్, మహిళలు మెచ్చే డిజైన్‌లతో, అందరికీ అందుబాటులో ఉండే ధరలతో మంచి స్పందన వచ్చిందని, రాజమహేంద్రవరంలో షోరూమ్‌ను కూడా ఆదరించాలని కోరారు.

శింగరాజుపాలెంలో బంగారం అపహరణ

నల్లజర్ల, ఆగస్టు 11: మండలంలోని శింగరాజుపాలెం గ్రామానికి చెందిన వడ్లమూడి హిమబిందు చెందిన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న బట్టలషాపును ఖాళీ చేసేందుకు కొండయిగుంట గ్రామానికి చెందిన యంత్రపాటి రాజు ఆటో కిరాయికి పెట్టుకున్నానని, బట్టల బ్యాగులు ఇంటికి చేర్చే క్రమంలో అందులో పెట్టిన 28గ్రాముల బంగారు ఆభరణాలు మాయం కావడంతో ఆటో యాజమాని రాజును నిలదీసింది. తనకు తెలియదని చెప్పడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ మోహన్ కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కొవ్వూరు, ఆగస్టు 11: పేకాట శిబిరంపై దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట సమీపంలో ఆదివారం ఉదయం పేకాడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారి నుంచి రూ. రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 11: గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. ఆదివారం రాత్రి ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 7.10 అడుగులుగా నమోదు కాగా 4,08,157క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తున్నంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 2000, మధ్యడెల్టాకు 1500, పశ్చిమడెల్టాకు 2000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ముగ్గురు సీఐలు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన ముగ్గురు సీఐలు ఆదివారం ఆయా స్టేషన్లలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ నరసింహ కిషోర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. రాజానగరం సీఐగా ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, బొమ్మూరు సీఐగా పి.కాశీ విశ్వనాథ్, ధవళేశ్వరం సీఐగా తిప్పా గణేశ్ చార్జి తీసుకున్నారు. ముగ్గురు సీఐలకూ గతంలో జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది. వీరయ్య గౌడ్ రాజమహేంద్రవరం త్రీటౌన్, కాశీ విశ్వనాథ్ రాజానగరం, రాజమహేంద్రవరం టూటౌన్ సీఐగా గణేశ్ విధులు నిర్వర్తించారు.

కను..మరుగు!

» గోష్పాదక్షేత్రంలో బట్టలు మార్చుకునే తాత్కాలిక షెడ్‌కు అమర్చని రేకులు

» ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు



గోష్పాదక్షేత్రంలో రేకులు లేకుండా ఉన్న స్త్రీలు బట్టలు మార్చుకునే షెడ్

కొవ్వూరు, ఆగస్టు 11: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో బట్టలు మార్చుకోవడానికి సరైన వసతులు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరితీరం కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి ప్రతిరోజు అనేక మంది భక్తులు వస్తుంటారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అయితే స్నానాలు ఆచరించిన మహిళలు బట్టలు మార్చుకోవడానికి మున్సిపాల్టీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా రేకుల షెడ్లు ఏర్పాటుచేశారు. అయితే ఆ షెడ్లు గోదావరి వరదకు కొట్టుకుపోకుండా జూలై నెలలో ముందస్తు జాగ్రత్తగా షెడ్ల నుంచి రేకుల తీసివేసి జాగ్రత్త చేశారు. వరద తగ్గుముఖం పట్టినా షెడ్లకు రేకులు బిగించక పోవడంతో క్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణం రేకుల షెడ్లను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. రిటైర్డ్ సీఐడీ ఇన్‌స్పెక్టర్ తాళ్ళూరి రామచంద్రరావు మాట్లాడుతూ అఖండ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే మహిళలు తడి వస్త్రాలు మార్చుకోవడానికి సరైన ఏర్పాట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి షెడ్లు చుట్టూ రేకులు ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

రంగా ప్రజల పక్షపాతి

వంగవీటి విగ్రహావిష్కరణలో రాధాకృష్ణ



సీతంపేటలో రంగా విగ్రహావిష్కరణలో పాల్గొన్న వంగవీటి రాధ, ఎమ్మెల్యేలు ముప్పిడి, ఆదిరెడ్డి వాసు, బొలిశెట్టి శ్రీనివాసరావు

కొవ్వూరు, ఆగస్టు 11: వంగవీటి మోహన రంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారని, ఆయనను 3 దశాబ్దాలుగా గుండెల్లో నిలుపుకున్న అభిమానం మరువలేనిదని వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కొవ్వూరు మండలం సీతంపేటలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు ఇన్నిసార్లు ఎమ్మెల్యేగా పనిచేశామని గొప్పలు చెప్పుకుంటారు కాని, రంగా 1985 నుంచి 88 వరకు మాత్రమే ఎమ్మెల్యేగా పనిచేసి కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారన్నారు. భవిష్యత్‌లో అందరూ కలసికట్టుగా ప్రయాణం చేయాలన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్, రంగా విగ్రహం లేని నియోజకవర్గాలు ఉండవన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రంగాను తానెప్పుడూ చూడలేదని, ఆయన పెంపకాన్ని చూస్తున్నానన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపులో వంగవీటి రాధ పాత్ర ఉందని, వాసు అందుబాటులో ఉండి సమస్యలు తీరుస్తాడని తెలిపారని ఆ విధంగానే నేడు పనిచేస్తున్నానన్నారు. భవిష్యత్‌లోను మీ కోసం ఆలోచించే వ్యక్తులను కాపాడుకోవాలన్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీహరిని ఉద్దేశించి మాట్లాడుతూ యువతను ఇబ్బంది పెట్టొద్దని, పడడం లేవడం తమకు అలవాటేనన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రంగా బతికుంటే ముఖ్యమంత్రి అయ్యి ఉండేవారన్నారు. దుర్మార్గపు రాజకీయ తంత్రంలో కులం మొత్తం నలిగిపోయింది, రంగా కులానికి మతానికి నాయకుడు కాదు. బడుగు బలహీనవర్గాల కోసం పోరాడిన మహనుభావుడన్నారు. రంగా గారి ఆశయాలతో పనిచేస్తున్న పవన్‌కళ్యాణ్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కరాటం రాంబాబు, బండారు శ్రీనివాస్, ద్విసభ్య కమిటి సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్‌లు జెట్టి బంగారయ్య, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, రంగా, రాధ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

కాపులంతా ఐక్యంగా ఉండాలి

నల్లజర్ల, ఆగస్టు 11: కాగా నల్లజర్లలో కాపు జేఏసీ మండల కన్వీనర్ ఉన్నమట్ల సత్యకిరణ్ ఇంటికి వంగవీటి రాధాకృష్ణ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక కాపు నాయకులతో ముచ్చటించారు. కాపులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. కాపుల్లో వెనుకబడ్డ వారికి చేయూతనివ్వాలని పేర్కొన్నారు. ఆర్థికంగా బలపడిన వారు సాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఒకే పోగు..మువ్వన్నెల జెండా

వేమవరం చేనేత కళాకారుడి ప్రతిభ..ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: ఒకే పోగుతో తయారు చేసిన పదడుగుల నిడివి గల జాతీయ జెండాను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని తమ స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ జెండాను పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల సత్యనారాయణ తయారు చేశాడు. ఒకే పోగుతో జాతీయ జెండాను తయారు చేయడం ఉభయ గోదావరి జిల్లాల వాసులకు గర్వకారణమని దుర్గేష్ అన్నారు. స్థానిక రాకా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై అవగాహన అవసరం

ఎల్ఐసీ యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుపతయ్య

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: రాజమండ్రి ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ కాలనీలోని యూనియన్ భవన్‌లో కేంద్ర బడ్జెట్-ఉపాధి కల్పన-అవకాశాలపై ఆదివారం సదస్సు జరిగింది. యూనియన్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు అధ్యక్షత జరిగిన ఈ సదస్సుకు హైదరాబాద్ నుంచి యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య ముఖ్యవక్తగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యం, మౌలిక వసతుల ప్రాజెక్టు కోసం ఎక్కువ మొత్తాల్లో కేటాయించడం ద్వారా నైపుణ్యం కలిగిన, లేని కార్మికులకు ఉద్యోగ అవకాశాలను సృష్టించవచ్చన్నారు. బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు కేటాయింపులు మరింత పెంచితేనే ఉపాధి కల్పన అవకాశాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులు కూడా బడ్జెట్ మీద అవగాహన పెంచుకోవాలన్నారు. తొలుత యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ స్వాగత ఉపన్యాసం చేసారు. సదస్సులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎల్ఐసీ యూనియన్ నాయకులు ఎ.సుబ్బారావు, ఎస్.గనెయ్య, ఏకే విశ్వనాథ్, బి.శ్రీనివాస్, ఐవీ సుధాకర్, జి.శ్రీనివాస్, వి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలు పుస్తకావిష్కరణ



గ్రామదేవతలు పుస్తకావిష్కరణలో రచయితలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: స్థానిక కోర్లమ్మపేట, కోర్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ రచయిత్రి చల్లా సత్యవాణి రచించిన గ్రామదేవతలు పుస్తకాన్ని రాష్ట్రపతి పురస్కార గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి ఆదివారం ఆవిష్కరించారు. గౌరవాధ్యక్షుడిగా పాల్గొన్న గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ సత్యవాణి ఏ పుస్తకం రాసినా సమాజానికి ఎంతో మేలు చేకూరేవిగా ఉంటాయని, ఈ 38వ పుస్తకం గ్రామదేవతలు వెలసిన వివిధ ప్రదేశాల చారిత్రాత్మక గొప్పదనాన్ని చదువరులందరికీ ఎంతో ఉపయోగపడేలా రాశారని కొనియాడారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం భక్తులకు ఒక గైడ్‌లా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్, సమాచారమ్ రాఘవరావు, తేతలి ఉమామహేశ్వరి, ప్రభాకరరావు, జయప్రద, కె.శ్రీనివాస్, మణి పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్ల సర్వే

జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: మాన్యువల్ స్కావెంజర్ల సర్వే జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో నలుగురు సభ్యులుంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వారి కోసం పనిచేసే సంఘాల్లోని ఇద్దరు ప్రతినిధులు ఉంటారన్నారు. ఈ నలుగురిలో ఒక మహిళ సభ్యురాలుగా ఉంటారన్నారు. నిబంధనలు అనుసరించి ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో ఈనెల 13వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత కార్యాలయం, సబ్‌కలెక్టరేట్ ప్రాంగణం రాజమహేంద్రవరంలో దరఖాస్తులను అందించాలని కోరారు. మరింత సమాచారం కోసం 79934 99820 నెంబరును సంప్రదించాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహనకు పోస్టర్ల ఆవిష్కరణ



క్యాన్సర్‌పై అవగాహనకు పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్యాన్సర్‌పై అవగాహన కల్పించే దిశగా ఏర్పాటు చేసిన కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, దానిపై అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చిన పీఎంపీలను అభినందించారు. ఈ నెల 15 నుంచి ప్రభుత్వం నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లలో ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. పీఎంపీ సమస్యలు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌ల దృష్టిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్ సుకుమార్, తోరాటి ప్రభాకరరావు, వీబీటీ రాజు, బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్ని, రహమాన్ ఖాన్, మట్టా రమేష్, ప్రసాద్ బాబు, ఎం.జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో

ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11: సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకే దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వరంగంలోని రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు విశాఖపట్నంలో జరిగే జాతీయ సమితి సమ్మేళనంలో దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, అల్యూమినియం వర్కర్స్ యూనియన్ నాయకుడు కొండలరావు, సుబ్బారావు, పేపర్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళాగౌతమి రచయితల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనంద్ గార్డెన్స్‌లో ఆదివారం కళారచయితల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ మాస శోభపై కవితలు రాసిన రచయితలను కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి అభినందించారు. కార్యదర్శి పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ కళాగౌతమి స్థాపించి 30 ఏళ్లయిన సందర్భంగాఈ నెల 27,28,29 తేదీల్లో వేడుకలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సప్పా దుర్గాప్రసాద్, వీవీ సుబ్రమణ్యం, ఎల్.శ్రీనివాసరాజు, భమిడిపాటి భీమశంకరం పాల్గొన్నారు.

బయోపోర్టిఫైడ్‌పై కేవీకేలో అవగాహన

రాజానగరం, ఆగస్టు 11: రాజమహేంద్రవరం సీటీఆర్ఐ, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సంయుక్త ఆధ్వర్యంలో కలవచర్ల కేవీకేలో బయోపోర్టిఫైడ్, వాతావరణ అనుకూల పంటల రకాలపై రైతులకు, వ్యవసాయ విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐకార్)విడుదల చేసిన రకాల్లో 69 క్షేత్ర పంటలు, 40 ఉద్యాన పంటల రకాలున్నాయన్నారు. బయోపోర్టిఫికేషన్ అనేది జన్యు మార్పు ద్వారా అవసరమైన పోషకాలను అధిక స్థాయిలో కలిగి ఉండేలా ప్రధానమైన పంటలను ఉత్పత్తి చేసే ప్రక్రియ అని అన్నారు. మొక్కలు పెరుగుతున్నప్పుడు మొక్క ఆహారాన్ని మరింత పోషకమైనదిగా చేయడంపై దృష్టి పెడుతుందన్నారు. వాతావరణ అనుకూల పంట రకాలను త్వరగా అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

కేటుగాడిని.. పట్టేశారు!

ఇద్దరు బాలికలూ సేఫ్..



రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరానికి చెందిన ఇద్దరు బాలికలను ఓ యువకుడు ట్రాప్ చేసి తీసుకెళ్లడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఆ కేటుగాడిని పోలీసులు ఆది వారం అదుపులోకి తీసుకున్నారని, బాలికలు సురక్షితంగా ఉన్నారని తెలు స్తోంది. విజయనగరం జిల్లా బత్తిరాజేరు మండలం పెదమన్నాపురానికి చెం దిన మారోజు వెంకటేశ్ అదే ఊరికి చెందిన ఓ 17ఏళ్ల బాలికతో గత ఏడాది జూలైలో ఉడాయించాడు. దీనిపై అక్కడి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలికను వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ ధవళేశ్వరం చేరుకు న్నాడు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కల్లబొల్లి మాటలు చెప్పి డబ్బులు లాగేసి ఆ ఊరి నుంచి మరో ఊరికి వెళ్లిపోవడం ఇతడికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో ధవళేశ్వరంలోని తాను ఉంటున్న ఇంటి పక్కన ఉన్న ఒక మహిళతో పరిచయం పెంచుకున్నాడు. బుద్ధిమం తుడిగా నటిస్తూ దగ్గరయ్యాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొద్ది నెలల తర్వాత రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను తీసుకొని విజయవాడ వెళ్లి ఓ చోట బస కల్పించాడు. ధవళేశ్వరం వచ్చి పిల్లాడిని తీసుకెళ్లి తల్లి వద్దకు చేర్చాడు. హాస్టల్‌లో దింపుతానని ఆ ఇద్దరు బాలికలకు మాయమాటలు చెప్పి అతడి వెంట తీసుకెళ్లాడు. వాళ్లు హాస్టల్‌కి చేరకపోవ డంతో తల్లి ఫిర్యాదుతో గత నెల 30న ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో తల్లి పిఠాపురం వెళ్లి రెండు రోజుల క్రితం టీడీపీ ఇన్‌చార్జి వర్మకు విన్నవించింది. ఆయన ఎస్పీతో మాట్లాడడంతో వేగం పెరిగింది. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ కార్యాలయంలోని సైబర్ సెల్ నిరంతర పర్యవేక్షణ చేసింది. దీంతో రెండు రోజుల్లోనే కేసు ఓ కొలిక్కి వచ్చింది. సాంకేతికత సహాయంతో బాలికలతో ఆ దుండగుడు నెల్లూ రులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై వాళ్లు అక్కడి నుంచి మరో చోటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్న అనంతరం వెంకటేశ్, ఆ బాలికలను చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురినీ సోమవారం రాజమ హేంద్రవరం తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. బాలికలను తీసుకెళ్లడంలో నిందితుడి ఉద్దేశం వెల్లడి కావాల్సి ఉంది. అయితే, మిస్సింగ్ కేసుల్లో పోలీ సులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనడానికి ఈ కేసు తాజా ఉదాహరణనే ఆరోపణలు వినవస్తున్నాయి. 10 రోజుల్లో సాధ్యం కాని పని ప్రజాప్రతినిధుల హెచ్చరికలతో రెండు రోజుల్లో ఎలా సాధ్యమైందని కొందరు ప్రశ్నిస్తున్నారు.

ఐకమత్యం చాటుకున్న జిల్లా పోలీసులు

సహోద్యోగికి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం



చెక్కు అందజేస్తున్న సహోద్యోగులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు మరోసారి ఐకమత్యం చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సహోద్యోగికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. సాయుధ రిజర్వు కార్యాలయంలో వి.శ్రీనివాస్(పీసీ 606) కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఇది గమనించిన సాయుధ రిజర్వు, మోటార్ ట్రాన్స్‌పోర్టు సిబ్బంది కలిసి సేకరించిన రూ.2.50 లక్షలను ఆదివారం శ్రీనివాస్ భార్యకు అందించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఉదారత చూపిన సిబ్బందిని ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు. శాఖలోని అందరూ పోలీసు కుటుంబమనే స్ఫూర్తిని చాటారని ప్రశంసించారు. బాధిత కానిస్టేబుల్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ రవికుమార్, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రఘురాం పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో కిక్ బాక్సింగ్ పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 31వ ఏపీ రాష్ట్ర కిక్ బాక్సింగ్ పోటీలను టీడీపీ రాష్ట్ర హెల్త్‌విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ప్రారంభించారు. ఆదివారం జాతీయ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ కె.అగర్వాల్, రాష్ట్రాధ్యక్షుడు జి.ఆనంద్ బాలు, రాష్ట్ర కార్యదర్శి పి.ఆనంద్ ఆచార్య, రాజమండ్రి చైర్మన్ రొంపిచర్ల ఆంటోనిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరామ్ కిరణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో శీలం గోవింద్, ఎం.గణేష్, ఎన్.గిరి వెంకటరమణ, స్టేట్ కోచ్ ఎం.భవానీశంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

రాజానగరం, ఆగస్టు 11: మండలంలోని గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు నేటి నుంచి మూడు రోజుల పాటు రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలో(గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు) శానిటేషన్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్ట్రాక్టీస్, వీధి లైట్లు, తదితర అంశాలపై 12 నుంచి 14 తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఈశిక్షణకు విధిగా హాజరుకావాలన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	మురారి
వై.స్క్రీన్ 2	తుఫాన్
దేవిశ్రీ(గాయత్రి	బడ్డీ
అనన్య	కమిటీ కుర్రోళ్లు
నిడదవోలు	
వీ మ్యాక్స్	బడ్డీ
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	పురుషోత్తముడు
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---